మెత్తని పులి

"ఇంట్లో చండశాసనుడుగా, ఉద్యోగ జీవితంలో సుగ్రీవుడుగా, ఊళ్లో సర్వ సమర్థుడుగా బలరామయ్య కెలాంటి పేరైతే ఉందో అతని తమ్ముడు గోపాలానికి అగస్త్యభ్రాతగా అంతటి ప్రఖ్యాతి ఉంది.

సహోదరులలో ఇలాంటి తేడా కొట్టవచ్చినట్లు కనిపించడం ఆశ్చర్యమైన విషయమే! కానీ ఇందుకొక సమాధానం లేకపోలేదు. చేతి వ్రేళ్ళన్నీ సమానంగా ఉన్నాయా మరి....ఐతే ఆలోచించిన కొద్దీ ఇదికూడా కుంటి జవాబుగా స్ఫురించకపోదు. సమానంగా లేకపోతే నూనె, చేతివ్రేళ్ళు ఒకదానికొకటి పోలి ఉన్నాయి గదా! అన్నగారు ఇంట్లో పులిలా రొప్పుతుంటే తమ్ముడు పిల్లిలాగా గదిలో నక్కి కూర్చోడమేమిటి? అగ్రజుడు విడిచి పెట్టిన బాణంలా వీధివెంట నడచివస్తూ అల్లంత దూరాన కనిపిస్తే 'మా అన్నయ్య, మా అన్నయ్య' అంటూ అనుజుడు ప్రక్క సందులోకిగానీ, లేక చెత్త డబ్బా చాటుకుగానీ తప్పుకోడమేమిటి? అన్నదమ్ముల జీవన లక్షణాలలోనే ఇంత వైరుధ్యమా?

బలరామయ్యకు సంఘంలో అంతటి పలుకుబడి తెచ్చిపెట్టిన వాటిల్లో ముఖ్యమైనది, కటువుగా చెప్పాలంటే...అతడి నోరు. కాస్త మృదువుగా చెప్పాలంటే అతడి వాచాలత్వం. మరీ సరళంగా చెప్పాలంటే అతడి వక్తృత్వం.

అన్నగారంతటి వీసు మిగిలిన వదరుబోతు గదా! మరి తమ్ముడు పెదవి కదపడమే అబ్బురం.

మంచికో చెడ్డకో పదిమంది ఒకచోట సమావేశమై మీటింగన్న పేరుతో ఓ తతంగం జరిపితే చాలు, బలరామయ్య తప్పనిసరిగా హాజరు! ఆ సభకు తను అధ్యక్షుడో, లేక ఉపన్యాసకుడో, కాక కేవలం బహుమతులివ్వడానికి రప్పించబడ్డాడో, ఈ ధర్మ సందేహం అతణ్ణి బాధించేది గాదు. వేదికపైన నిల్చుని గొంతు సవరించి (లేదా సకిలించి) అతడు ఉపన్యాసం అందుకోగానే సభాసీనులైన మహాజనులు 'చచ్చామురా బాబూ' అనుకుంటూ ఏడుపు మొఖం పెట్టేవారు!

బలరామయ్యను ఉపన్యాసకుణ్ణిగా పిలిచిన ఒకానొక మీటింగులో జరిగిన గమ్మత్తు ఇక్కడ చెప్పుకోతగ్గది. ఆ మీటింగుకు అధ్యక్షుడు నగరంలో ప్రసిద్ధి కెక్కిన ఓ ప్లీడరు గారు. ఆయన కుర్చీలో నుంచీ లేచీ లేవకుండా "ఇప్పుడు బలరామయ్యగారు "కోఆపరేషన్"ను గురించి మాట్లాడతారు" అన్నారు. పరధ్యానంలో ఉన్నాడో ఏమిటో బలరామయ్యకు 'కో ఆపరేషన్' అన్న పదంలో 'కో' మాత్రం వినిపించింది కాదు. వెంటనే అతడు ప్రారంభించేశాడు :

"సోదర సోదరీ మణులారా! 'ఆపరేషన్' అన్న పదం ఆంగ్ల భాషలోనిది. అందువలన కొందరు 'ఆపరేషను' అన్న వైద్య ప్రక్రియ గూడా ఆంగ్లేయుల సంపర్కం వల్లనే మనవాళ్ళకు తెలిసివచ్చిందని భావిస్తుంటారు. అది కేవలం భ్రమ! చరకుడు తన వైద్య శాస్త్రంలోనే ఈ సంగతి ప్రస్తావించాడు. కానైతే ఈ ఆంగ్ల పదానికి అక్కడ పర్యాయపదంగా వాడిన సంస్కృత పదం శస్త్రచికిత్స, ఈ శస్త్ర చికిత్స యొక్క ప్రాధాన్యతను మన పూర్వులు ఎంతగా గుర్తించారంటే, దుష్టాంగాన్ని ఛేదించి మిగిలిన వాటిని రక్షించడం అత్యవసరమన్న భావం కావ్యాల లోకి కూడా ఎక్కింది..."

సభాసదులు మొదట ఆశ్చర్యపడి, తరువాత తెల్లబోయి, ఆఖరుకు ఘొల్లున నవ్వేశారు.

చెప్పవచ్చిందేమిటంటే బలరామయ్యకు తెలియని విషయమంటూ ఒకటీ లోకంలో లేదు. అతడు నోరు దెరిస్తే నీతులు మణుల్లా ముత్యాల్లా బయట పడడటం పరిపాటి. కానీ ఆ నీతులను స్వంతానికి గాకుండా హితోపక్షే౯ానికి మాత్రమే వాడుకోడం బలరామయ్య ప్రత్యేకత.

ఐదారు వందలమంది విద్యార్థులు చదువుకుంటున్న ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు బలరామయ్య. 'తన కోపమే తన శత్రువురా వెధవా....' అంటూ అతడు వో కుర్ర కుంకను చితకబాదేవాడు. 'వేళ తప్పకుండా బడికి రావలెను' అని రూలింగు జారీ చేస్తూ ప్రతిరోజు ఒకటి రెండు గంటలు ఆలస్యంగా పాఠశాలకు విచ్చేసేవాడు. ఒకవైపున చాడీలు చెప్పరాదు అని విద్యార్థులకు ప్రబోధిస్తూ తను మాత్రం జవాను పుల్లయ్య ఉపాధ్యాయులపై చెప్పే కొండేలకు చెవి ఒగ్గేవాడు.

ఇలాంటి బలరామయ్య గారికి గోపాలం తమ్ముడంటే చప్పున నమ్మడమే కష్టం.

తనకు సంబంధించిన ప్రతి వస్తువును గురించీ గొప్పలు చెప్పుకోడం బలరామయ్య అలవాట్లలో ఒకటి. తన గడియారం నిలిచిపోకుండా పాతికేళ్ళనుంచీ పనిచేస్తోందనీ, తన అర్ధ రూపాయి పూట కలం పార్కర్ పేనాకంటే బాగా రాస్తుందనీ, తన చెప్పులు మూడేళ్ళనుంచీ ఉపయోగిస్తున్నా అరిగి పోలేదనీ అతడెలాగైతే చెప్పుకునేవాడో, అలాగే భార్య పొదుపరితనాన్ని గురించి, కూతురి సంగీత వైశారద్యాన్నీ గురించీ, కుమారుల తెలివి తేటల్ని గురించీ చెప్పుకునేవాడు. పై వర్ణనలకు డిటోగా తన స్థిరాస్తి చరాస్తులలో గోపాలాన్ని కూడా ఒక చిన్న విభాగం క్రింత జమకట్టి "చిన్నవాడు కాదు కదా! పాతికేళ్లు వచ్చాయి కదా మా వాడికి! ఏదీ, ఏనాడైనా నా ఎదుట నిలిచి మాట్లాడి ఎరుగునా! నేను గీచిన గీటు దాటి ఎరుగునా" అంటూ అతడు తమ్ముడి భ్రాతృభక్తిని గురించి చెప్పుకుపోయేవాడు.

కానీ తన మాటల పునాదులకు వెనుక అంతర్యాల వాస్తవాలను గురించి బలరామయ్యకు ఆదినుంచీ అనుమానాలు కద్దు. కూతురి సంగీత విద్యను ఇరుగు పొరుగువారు హృదయ పూర్వకంగా మెచ్చుకోడంలేదేమో నన్నది, ఆయన అనుమానాల్లో ఒకటి. పొదుపు ఖర్చులలో మిగిలించిన డబ్బును భార్య తన పుట్టింటికి చేరవేస్తున్నదేమో నన్నది, ఆయన అనుమానాల్లో మరొకటి. బలరామయ్య గొప్ప వటవృక్షంలాంటి వాడైతే, అందులోని శాఖలన్నీ రకరకాల అనుమాన పిశాచాలకు ఆశ్రయాలు. వాటిలో గోపాలం భ్రాతృసేవా పరతంత్రతకు సంబంధించిన అనుమాన పిశాచానిది అగ్రస్థానం. అతి వినయం ధూర్త లక్షణమంటారు. అంటే వినయానికి ధూర్తత్వానికీ, భయభక్తులకు తిరుగుబాటుకూ మధ్య అట్టే దూరం లేదన్నమాట! ఇవి అవి గావడం ఏక్షణాన్నయినా సంభవమే! పైగా ఒకసారి చెడిపోయిన పనిముట్టుతో మళ్ళీ చివరిదాకా ఇబ్బంది పడక తప్పదు.... అందుకనే గోపాలమనే పనిముట్టును ఎంతో జాగ్రత్తగా వాడుకునేవాడు బలరామయ్య. గోపాలాన్ని చిన్న చేతి గడియారంతో పోలిస్తే రోజుకొక్కసారైనా మందలించడం ద్వారా దానికి 'కీ' యిచ్చేవాడు. గోపాలాన్ని కట్టెలు కొట్టే మచ్చుకత్తితో ఉపమిస్తే అది త్రుప్పు పట్టిపోకుండా ప్రతిరోజు అవసరమైనంత కాయకష్టం కల్పించేవాడు. తమ్ముణ్ణి పెందలకడనే నిద్రలేపి, పాఠములు శ్రద్ధగా చదువుకుని వేళ దప్పక బడికేగు మంచి కుర్రవాణ్ణిగా మలచడంలో బలరామయ్య కృతకృత్యుడు కాగలిగాడనే చెప్పవచ్చు. గోపాలం ఉదయం అయిదు గంటల

కళ్లు నిద్ర లేచేవాడు. అన్నగారి పిల్లలకు 'హోమ్‌వర్కు' లాంటివి చేసిపెట్టేవాడు. తరువాత కాలకృత్యాలు తీర్చుకుని, వదినగారిచ్చిన చిల్లరడబ్బులు జేబులో వేసుకుని మార్కెట్టుకు వెళ్ళి వచ్చేవాడు. అప్పటికి వదినగారూ, గోడ గడియారమూ పరస్పరం పోటీకి తలపడి ఉ డేవారు. ఆ పోటీలో వదినగారు గెలిచి వంటకాస్తా త్వరగా ముగిస్తే గోపాలం వేళకు ఆఫీసుకు వెళ్ళగలిగేవాడు. అలా కాకుండా వదినగారు ఓడిపోయి గోడ గడియారం గెలిస్తే ఆఫీసుకు వెళ్ళడంలో ఆలస్యమూ ఏతత్ఫలితంగా ఆఫీసరుగారి చీవాట్లు గోపాలానికి తప్పేవికావు.

మధ్యాహ్నం విశ్రాంతి సమయంలో స్వల్పంగా ఉపాహారం, వేడిగా ఓ అరకప్పు కాఫీ మాత్రం సేవించి సాయంత్రం ఆరు గంటల వేళకు యిల్లు చేరుకునేసరికి గోపాలానికి కాళ్లు చేతులు ఎక్కడివక్కడే వూడిపోయినంత నీరసంగా ఉండేది. అంత నీరసంలోనూ అతడు లాంతరు తుడిచి, దీపాలు వెలిగించి, ఒకటి రెండు గంటల సేపు ఒక చిన్న వీధి పలుకూటాన్ని నిర్వహింపవలసివచ్చేది. ఆ పిమ్మట నింపాదిగా పిల్లల భోజనం, ఆ పంక్తి లేచిన తర్వాత బలరామయ్య గారు భోజనానికి కూర్చుంటే భార్యతో ఎక్కడా లేని లోకాభిరామాయణాలన్నీ వంట గదిలోనే ముచ్చటింపబడేవి! భోజనం కాగానే తాంబూలం సేవించడం బలరామయ్య అలవాటు. ఆ అలవాటు కెక్కడ వేళాతిక్రమణ జరుగుతుందోనని గోపాలం తొందరగా తిన్న శాస్త్రం ముగించేవాడు. బంకు దగ్గరికి వెళ్ళి తమలపాకులు, వక్కపొట్లాలు తీసుకొచ్చేవాడు. అన్నగారు హాల్లో ఉంటే వరాండాలోనూ, వరాండలో ఉ ంటే హాల్లోనూ కొంతసేపు పచార్లు చేసి యింక తనకోసం పురమాయించబడే పనులేవీ లేవన్న కచ్చితమైన నిర్ధారణకు రాగలిగిన తర్వాత చాపా, దిండు తీసుకుని డాబాపైకి వెళ్ళిపోయేవాడు.

శరీరం సొమ్మసిల్లిపోయిన స్థితిలో ఆలోచనలకు పూనుకునేపాటి ఓపిక మెదడుకుండదు. గోపాలానికి అమాంతంగా నిద్ర ముంచుకొచ్చేసేది. రాత్రి పది గంటల కనగా పట్టిననిద్ర ఉదయం అయిదు గంటల దాకా అతణ్ణి తన ఒడిలో నుంచీ కదల నిచ్చేది గాదు... అప్పుడు ఉలికిపడి నిద్ర లేచేవాడు గోపాలం. ఇంట్లో కాఫీపొడి నిండుకున్నదేమో! బాయిలర్‌లోకి బొగ్గులు కావాలేమో! మార్కెట్టుకు వెళ్ళడం ఆలస్యమౌతుందేమో!

ఆశ్చర్యమేమిటంటే ఆ కుటుంబం, ఆ దినచర్య, ఆ జీవితము అవన్నీ ఎలా ఉ ండాలో అలాగే ఉన్నట్టు, వాటిని గురించి చెప్పుకోవలసిన రిమార్కులేవీ లేనట్టు భావించేవాడు గోపాలం. ఇంతకంటే ఆశించదగ్గ సుఖసంతోషాలు పృథ్వీతలంపైన లేకపోలేదన్న స్పృహయినా అతనికి కలిగేది కాదు. ఆ విధంగా అతడి జీవితంలో పాతికేళ్ళ గడిచిపోయాయి. ఆ తరువాతనైనా అతనికి ఆత్మజ్ఞానం స్వతహాగా కలిగిందని చెప్పలేము! ఓ వ్యక్తి గోపాలానికి జ్ఞానోదయం కలగడానికి తోడ్పడింది. ఆమె పేరు పార్వతి.

* * *

పార్వతిని నాలుగైదు విధాలుగా నిర్వచించవచ్చు. ఆమె ఇంటికి వచ్చిన క్రొత్త కోడలు. ఆ తరువాత బలరామయ్యగారి మరదలు. ఆపైన బలరామయ్య గారి భార్యకు తోడుకోడలు. చిట్టచివర గోపాలం భార్య.

బొద్దు మీసాలతోనూ, ఎర్రటి కళ్ళతోనూ పెద్దపులిలా కనిపించే బలరామయ్య కంటికి కనిపించకుండా పార్వతి ఆ యింట ఒదుగుళ్ళు పోయేది. తెచ్చిపెట్టుకున్న అనారోగ్యపు

చిహ్నాలతో లేచి తిరగడానికే ఆపసోపాలు పడిపోయే తోడుకోడలికి ఓవైపు సపర్యలు చేస్తూ మరోవైపున గృహకృత్యాల నన్నింటినీ తానొక్కతే చక్కబెట్టుకునేది. తల దువ్వమని, చుక్కబెట్టమని, దుస్తులు మార్చమని మారాము చేస్తూ చుట్టుముట్టే బావగారి పిల్లలను సముదాయించేసరికి ఆ అనుభవం లేని యిల్లాలికి తలప్రాణం తోక కొచ్చినంత పనయ్యేది. తెల్లవారు జామున అయిదు గంటల కంతా ఆ యిల్లు కార్ఖానాలా నిద్రలేస్తుంది. పెరట్లో బాయిలరు, వంట యింట్లో కాఫీ కోసం కుంపటి, అంతలో ఉపాహారం కోసం తహతహ, స్నానాలు చేయించి, బట్టలు మార్చి, ఉపాహారంతో సంతృప్తిపరచి పిల్లల్ని ఆలస్యంగాకుండా ఎనిమిదిన్నరకు బడికి పంపడం ఓ యజ్ఞాన్ని సాకల్యంగా చేసి ముగించినంత తతంగం! ఇక అప్పటి నుంచీ బలరామయ్య గారికి తమ హెడ్మాష్టరు గిరి జ్ఞప్తికి వచ్చి, బడికి బయల్దేరే సన్నాహం ప్రారంభ మౌతుంది. సమయానికాయనకు పాదరక్షలు కనిపించవు. గొడుగు కనిపించదు. ఉండినా వూడినా ఒక్కటే అయిన కళ్ళజోడు కనిపించదు. భర్తగారు బడికి ఆయత్తమయ్యే హంగామాలో అందాకా నీరసంగా పడి ఉండే గృహిణిలో సైతం ఎక్కడ లేని చైతన్యం పుట్టుకొచ్చేస్తుంది. కనిపించని పుస్తకాల కోసం, కలాల కోసం యిద్దరూ చేరి యిల్లంతా చింద వందర చేసేస్తారు. అంతటి గగ్గోలులోనూ ఆ యింట్లో కనిపించనది గోపాలం పొలకువ ఒక్కటే! వినిపించనది గోపాలం అలికిడి ఒక్కటే!

గోపాలం లేకపోతే తెరలు లేవవు. దీపాలు వెలుగవు. శబ్ద విస్తరణ యంత్రాలు పలుకవు. గృహనిర్వహణ అన్న నాటకంలో అతని పాత్ర ప్రముఖమైనదని నిస్సందేహంగా చెప్పవచ్చు. కానీ ఎటొచ్చీ తెర వెనుకనే ఉండిపోయే పాత్ర అతనిది.

కానీ పార్వతి కాపురానికి వచ్చినప్పటినుంచీ గోపాలంలో కొత్తగా కొన్ని మార్పులొచ్చాయి. మొదటిదీ ముఖ్యమైనదీ మునుపటిలా అతనికి నిద్ర పట్టడం లేదు. పార్వతి నిద్రపోయి, తానొంటరిగా మేలుకుని పై కప్పు కేసి చూస్తూ పడుకున్న సమయాల్లో అతని మనసులో ఏవేవో ఆలోచనలు రగులుకునేవి, ఈ యిల్లూ, ప్రపంచమూ ఒక్క మాదిరిగా కనిపించడం లేదు. సాయంకాలాల్లో తానింటికి తిరిగి వస్తున్నప్పుడు చేయి చేయి కలుపుకుని వాహ్యాళికి వెళ్తున్న భార్యాభర్తల్ని ఎందర్ని చూడలేదు? సినిమా థియేటరులో కండ్ల ఎదుట కనిపించే వెండి తెరపైని దృశ్యాల కంటే వెనుదిరిగి చూస్తే జంటలు జంటలుగా బారులు దీర్చి కూర్చున్న ఆలు మగల దృశ్యమే తనకు సహజ సుందరంగా, కన్నులకు నిండుగా కనిపిస్తుంది. గంటల తరబడి ఎదురెదురుగా కూర్చుని వాగ్వాదాలతోనూ, పరిహాసాలతోనే కాలం గడిపే దంపతులు గూడా ప్రపంచంలో దండిగానే కనిపిస్తారు. ఆ చైతన్యాన్ని సంభ్రమాన్ని తనెన్నడూ చవిచూడలేదు. చవిచూడలేడేమో! ఎందువల్ల? లోకంలో కోకొల్లలుగా కనిపిస్తున్న సుఖ సంతోషాలకూ, తనకూ మధ్య అడ్డుగోడ ఎందుకు ఏర్పడింది? ఎవరు ఏర్పరిచారు? దీన్ని కూలదోసి నేలమట్టం చేయాలంటే అందుకు ఉపాయం ఏమిటి?

పెళ్ళయిన క్రొత్తలో ఓ రోజు రాత్రి అంది పార్వతి "ఏమండీ? ఎదురింటి ఆవిడ కట్టుకున్న చీర చూచారా? చాలా బాగుంది గదూ?"

ఆ మాటల్లో నాకైతే మరీ బాగుంటుంది. కనుక కొనిపెట్టండి, అన్నధ్వని వినిపించడంతో చకితుడై పోయాడు గోపాలం.

తనైతే ఎదురింటావిడ కట్టుకున్న కొత్త చీరను చూడడం తటస్థించలేదు. బహుశా అది బాగానే ఉంటుంది. వెలగూడా అంత గిరాకీ గాకపోవచ్చు. ముచ్చట పడినప్పుడల్లా పెళ్ళాని కొక చీర కొనిపెట్టడం పొరుగింటాయన రివాజు. తన కలాంటి సౌలభ్య మెక్కడిది?

విద్యావివేకాలకు, లోకంలో ప్రయోజకుడుగా పరిగణింపబడటానికి సంబంధం వున్నట్టు తోచదు. కేవలం ఆర్థిక సంబంధమైన లావాదేవీల వలన మాత్రమే సిద్ధించేది ప్రయోజకత్వం. పాతికేళ్ళ జీవితంలో ఒకరిని తను అప్పు అడిగినట్టు గానీ, లేదా ఒకరికి చేబదులు యిచ్చినట్టు గానీ గుర్తులేదు. తను న్యూసుపేపరు కొన్నాడంటే అది అన్నగారి కోసం! క్రాపు దువ్వెన కొన్నాడంటే అది అన్నగారి బిడ్డల కోసం!

ప్రీతిపాత్రుడైన శిష్యునితో గురువు "నిన్ను నా అంతటి వాణ్ణిగా చేస్తాను" అని చెబుతాడు. ఓవ్యక్తి యొక్క పలుకుబడికి, పరపతికి మొదట అతడి కుటుంబంలో నుంచీ దోహదక్రియలా సమకూర వలసి ఉంటుంది. కుటుంబంలో పూచికపుల్లతో సమానంగానైనా పరిగణన లేనివాడు యిక లోకంలో ఎలా గుర్తింపబడగలడు?

గోపాలం కుమిలిపోసాగాడు. తను తెగువ చేసి పెళ్ళాని కొక చీర కొనిపెట్టలేని అసమర్థుడు. పెళ్ళయి ఆరుమాసా లౌతున్నా భార్య నొకసారి సినిమాకు తీసుకెళ్ళని అప్రయోజకుడు. వెయ్యిమాట లెందుకు? ఏ విధంగా చూచినా తను చేతగానివాడు.

"అదేమిటండీ! ఇటీవల మీరు ఉత్సాహంగా కనిపించడం లేదే"! ఓ రోజు రాత్రి పార్వతి గోపాలాన్ని ప్రశ్నించింది.

గోపాలాని కొక్కసారి గొంతెత్తి ఏడవాలనిపించింది.

"ఏం చేయమంటావు పార్వతీ! నా బ్రతుకిలా పరిణమించింది. ఈ యింట్లో గట్టిగా వూపిరి పీల్చి వదలడానికే నాకు భయం. అనవసరంగా నేనెందుకిలా భయపడుతున్నావా అని వితర్కించుకుంటున్నాను. కారణం బోధపడటం లేదు. అకారణమైన భయంతో నేను తాబేలులా నాలో నేనే ముడుచుకపోవడానికి అలవాటు పడిపోయాను" అన్నాడు గోపాలం.

ఈ పరిణామానికి పార్వతి ఎంతగానే సంతోషించింది. ఎలాగైతేనేం, జడ పదార్థంలాంటి ఈ మానవుడిలో ఆలోచన ప్రారంభమైంది. తీవ్రమైన ఆలోచన మానవుణ్ని కార్యశూరత్వానికి ప్రేరేపిస్తుంది.

సరిగ్గా అదే సమయానికి బలరామయ్య భార్య "ఏమండీ! నిద్ర పోయారా?" అంది.

"ఇంకా లేదు" అన్నాడు బలరామయ్య.

"కొద్ది రోజుల నుంచీ మీ తమ్ముడి వాలకం అదొకరకంగా కనిపించడం లేదూ?"

"ఒక యింటివా డయ్యాడు గదా! సంసార సాగరాన్ని ఎలా ఈదడమన్న దిగులేమోలే!" అని తన ఛలోక్తికి తానే నవ్వసాగాడు బలరామయ్య.

* * *

గోపాలానికొక శుభవార్త తెలిసింది.

కొలది మాసాల్లో తాను తండ్రికాబోతున్నాడు!

అతనికొక సినిమా పాట జ్ఞప్తికి వచ్చింది. "నేను పుట్టిన కారణమేమిటో తెలియక మునుపే నువ్వెందుకు పుట్టావురా బాబూ' అని ఆ చిత్రంలో కథానాయకుడు వాపోతాడు.

గోపాలం వితర్కించుకోసాగాడు నిజమే! తానెందుకు పుట్టినట్టు? నిస్వార్థంగా అన్నగారికి, ఆయన సంసారానికి సేవలు చేయడానికేనని తానైతే సరిపెట్టుకోగలడు. కానీ తనను కట్టుకున్న నేరానికి ఓ అయినింటి అమ్మాయిని పీడించడం ఏం న్యాయం?

ఆలోచించిన కొద్దీ గోపాలానికి కొత్తకొత్త విషయాలు బోధపడుతూ వచ్చాయి. తనకు పెళ్ళి చేయడంలో గూడా అన్నగారి ఉద్దేశం వేరు. పెళ్లి చేసుకుని తమ్ముడొక ఇంటివాడైతే

ఆయనకి ఒరిగేదేమీ లేదు. ఐనా వెట్టిచాకిరి చేయడానికి శాశ్వతంగా ఓ మనిషి లభించడం మాత్రం అదెంత వెసులుబాటు కాదు? పార్వతిని కానుపు కోసం పంపమని వాళ్ళ పుట్టింటివాళ్ళు వచ్చి అడిగినప్పుడల్లా యిప్పుడు గాదని బలరామయ్య గారు వాయిదా వేస్తూ రావడంతో గోపాలం వూహ మరింతగా బలపడసాగింది.

ముంతపొగ పెట్టినట్టున్న ఆ కుటుంబ వాతావరణంలో ఉక్కిరిబిక్కిరై పోయిన గోపాలం లేని తెగువ కొని తెచ్చుకుని భార్యతో ఒక్కమాట మాత్రం చెప్పేశాడు, "ఎలాగూ నువ్వు కానుపుకు పుట్టింటికి వెళుతున్నావు గదా పార్వతీ! నువ్వు తిరిగొచ్చేసరికి మన బ్రతుకిలా ఉండదు. కానీ అది ఎలా పరిణమిస్తుందో నేను స్పష్టంగా ఊహించలేకుండా ఉన్నాను..."

పార్వతి పుట్టింటికి వెళ్ళింది.

రోజులు గడిచిపోతున్నాయి.

సాధ్యమైనంతలో గోపాలానికి ఒక్కటే ఉపాయం స్ఫురించింది. అతడు ట్రాన్స్‌ఫరుకోసం ప్రయత్నించి చూచాడు. కానీ ససేమిరా వీల్లేదన్నాడు ఆఫీసరు, "అదేమిటోయ్ గోపాలం! ఈ వూరివాడివి. బాగా పనిచేస్తున్న కుర్రాడివి. వృద్ధిలోకి రావలసినవాడివి. 'రోలింగు స్టోను'ను గురించిన సామెత తెలియదా నీకు! ఏ పరిస్థితిలోనూ నీకు ట్రాన్స్‌ఫరు వాంఛనీయంగాదు. నామట్టుకు నేను మాత్రం ఆమోదించను" అంటూ ఆయన గోపాలం ఆశను సమూలంగా తుడిచిపెట్టేశాడు.

మళ్ళీ వుపాయాంతర అన్వేషణ ఒక్కటే శరణ్యమైంది గోపాలానికి!

లీలగా ఒక మార్గం పొడగట్టింది గానీ అది చాలా కష్టమైన మార్గం. వూహించడానికే వెరపుగొలిపే మార్గం, కానీ గత్యంతరం లేదు!

గోపాలం లెక్కలేనన్నిసార్లు ధైర్యం చేశాడు. అన్నగారి ఎదుటకు వెళ్ళేవాడు. పెదవి కదిలించి గొంతుక సరిచేసుకునేవాడు. తమ్ముడేదో చెప్పబోతున్నాడని గ్రహించి అతడివైపు చూచీ చూడకుండా 'ఏమిట్రా' అంటూ ముఖం చిట్లించుకునేవాడు బలరామయ్య. అంతటితో గోపాలంలో ధైర్యం దిగజారిపోయేది. "ఏముంది! ఏంలేదన్నయ్యా!" అంటూ అతడు దూరంగా జారుకునేవాడు.

కట్టకడకు ఇలాగైతే లాభంలేదనుకున్నాడు గోపాలం. కానీ ఒకటి మాత్రం నిజం! తను ముఖాముఖిగా అన్నగారి ఎదుట నిలిచి మాట్లాడలేడు. ఐతే యిప్పుడు ఉపాయం ఏమిటి? గోపాలం ఓ నిర్ణయానికి వచ్చి రంగనాథం దగ్గరకు బయల్దేరాడు.

ఈ విశాల ప్రపంచంలో బలరామయ్యకు ఆప్తమిత్రులని చెప్పుకో తగ్గ ఇద్దరు ముగ్గురిలో రంగనాథం ఒకడు. వృత్తిరీత్యా అతడు యిన్స్యూరెన్సు ఏజంటు. ఎదుటివాడు తన సలహాకు బొత్తిగా విముఖంగా ఉన్నప్పటికీ నాలుగు మంచిమాటలతో అతణ్ణి సుముఖుణ్ణిగా చేసుకోగల వాక్చాతుర్యం అతడి సొమ్ము.

"ఏమిటోయ్ గోపాలం! రాక రాక ఇలా వచ్చేశావ్! రా కూర్చో, విశేషాలేమిటి?" అంటూ పరామర్శించాడు రంగనాథం.

"అబ్బే,ఏమున్నాయండి!" అంటూ నీళ్ళు నమిలి, అయిదు నిమిషాలు మౌనంగా కూర్చున్నాడు గోపాలం.

"విశేషమే లేకుంటే నువ్వు నన్నింత దూరం వెతుక్కుంటూ వచ్చేవాడివే గావు. చెప్పవయ్యా గోపాలం! మొగమాట మెందుకు?" అన్నాడు రంగనాథం.

"మరేం లేదండి!కారణాలేవైతే నేమి! చిన్న ఇల్లొకటి అద్దెకు తీసుకుని వేరుగా వుండిపోవాలనుకుంటున్నాను...."

"అలాగా గోపాలం! మంచిదేకదూ మరి! ఎన్నాళ్లు కలిసి ఉన్నా ఎప్పుడో ఒకప్పుడు వేరు కావలసిందే. కక్షలూ, కార్పణ్యాలు లేకుండా మూరెడు హెచ్చు తక్కువగా ఉన్న ఆస్తిపాస్తులను పంచుకుంటే సరిపోతుంది. బలరామయ్యతో నేను చెబుతానుండు."

ఓ క్లిష్ట సమస్యను పరిష్కరించిన తృప్తితో గోపాలం ఆఫీసుకు వెళ్లాడు. అయిదు గంటలు వరకు పనిచేశాడు. ఆ తరువాత మెల్లగా రోడ్డు పైకి వచ్చాడు. అప్పుడతని బుర్రలో ఆతనిపాతం లాంటి కదలిక ఒకటి బయల్దేరింది. కొంపదీసి ఈ పాటికే రంగనాథం అన్నగారిని కలుసుకున్నాడేమో! అబ్బే, అదెలా సాధ్యమవుతుంది? చెప్పగానే తన పని చేసిపెట్టడానికి అంతగా పనుల తొందర లేనివాడా రంగనాథం....

కానీ రంగనాథం యొక్క స్వంత పని ఎప్పుడూ ఇతరుల పనులకు అడ్డు తగలడమేనని గోపాలానికి తెలియదు.

గోపాలం రాకకోసం ఎదురుతెన్నులు చూస్తూ కూర్చున్న బలరామయ్యఅతడు కనిపించగానే ఆగ్రహోదగ్రుడై పైకి లేచాడు.

"ఏమిట్రా! ఆ అడిగేదేదో నా ముఖాన్నే అడగరాదూ! ఆ రంగనాథం గాడి మధ్యవర్తిత్వం కావలసివచ్చిందా నీకు!"

గోపాలం నేరస్తునిలా తల వొంచుకుని స్తంభం చాటున నిలుచున్నాడు.

"వూ:! నువ్వు ఆస్తిపాస్తుల పంపిణీ కోసం కాచుక కూర్చున్నావన్న మాట! కథ అందాక వచ్చిందన్నమాట! ఒరేయ్ గోపాలం! రంగనాథం కాదు. అలాంటివాళ్ళు వెయ్యిమంది వచ్చినా సరే నా బొందిలో వూపిరుండగా ఆ పని మాత్రం జరుగదు..."

గోపాలం సాహసంచేసి "ఆస్తి సంగతి నేనెత్తలే దన్నయ్యా! ప్రత్యేకంగా ఉండదలచుకున్నానని చెప్పాను..." అన్నాడు.

"ఓహోహో, అలాగట్రా బాబూ! ప్రత్యేకంగా ఉండదలచుకున్న వాడివి నువ్వు మళ్ళీ ఇక్కడికెందుకు రావలసివచ్చిందని నేనడుగుతున్నాను. నువ్వింక ఒక క్షణం నా యింట్లో ఉండటానికి వీల్లేదు. వెళ్ళు. వెళ్ళిపో..."

పురాణ కాలంనాటి బలరాముడు ఒకప్పుడు హస్తినాపురాన్ని తన నాగేటి కర్రతో పెకలించదలచుకున్నాడట! పెకలించకపోయినా, పెకలించటానికి కావలసినంత కోపావేశంతో అతడు గోపాలాన్ని తోసుకుంటూ బయటికి గెంటి వీధి తలుపు దభాలున వేసుకున్నాడు.

దిమ్మెక్కిపోయిన తలతో గోపాలం కాసేపు వసారా గుంజ కానుకుని విగ్రహంలా నిల్చున్నాడు. ఇరుగిండ్లవారు, పొరుగిండ్లవారు కిటికీల్లో నుంచీ అతడి దురవస్థను చూచి జాలిపడుతున్నారు. ఒక్కొక్కప్పుడు సానుభూతిని గూడా భరించడం కష్టం. గోపాలం వీధిలోకి వచ్చాడు. చరచరా నాలుగు ఫర్లాంగులదూరం నడిచాడు. అక్కడొక చిన్న పార్కు, తెరచిన తలుపులతో, చల్లటి గాలితో, రేడియో గానంలో సాదరంగా గోపాలాన్ని లోనికి ఆహ్వానించింది.

అన్నగారి నిష్ఠుర ప్రవర్తనను తలచుకుంటూ గోపాలం ఓ సిమెంటు బెంచీపైకి వాలిపోయాడు. ఓ రక్తం పంచుకుని పుట్టిన అన్నదమ్ములు కొన్నాళ్లపాటు కలసివుండి, ఏవో యిబ్బందులు మూలంగా వేరుపడడం సాధారణంగా సమిష్టి కుటుంబాల్లో జరిగే మామూలు సంఘటనే. అన్నదమ్ముళ్ళన్న తర్వాత ఎన్నాళ్ళు కలిసి ఉన్నా ఎప్పటికైనా వేరుబాటు తప్పదు. ఈ మాత్రం పరిజ్ఞానం లేకుండా ఈయన తనపై మండిపడతా డెందుకు? ఆస్తిలో వాటా అడగడం మహాపరాధమా! అంతమాటా అడగక ముందే

ఈయన తనను ఇంట్లోనుంచీ వెళ్ళిపొమ్మంటాడా? అదీ స్వంత ఇల్లయినా కాదు. అద్దె కొంప!...

ఎడతెగని ఆలోచన అలజడిలో అలాగే సొమ్మసిల్లి ఆ బెంచీపైన్నే నిద్రపోసాగాడు గోపాలం.

* * *

గోపాలాన్ని యింటినుంచీ వెళ్ళగొట్టిన తర్వాత అయిదారు మాసాలు కాలగర్భంలో కలిసిపోయాయి. అతడేమైపోయాడో బలరామయ్యకు తెలియదు. కనీసం తెలుసుకోవాలని గూడా అతడు ప్రయత్నించలేదు.

అప్రయోజకుడు, వాడేమై ఉంటాడు? ఉద్యోగానికి రాజీనామా పెట్టి ఏకంగా అత్తగారింటికి వెళ్ళిపోయాడేమో! లేకుంటే తనంతట తనే కోరి మరొక వూరికి బదిలీ అయిపోయాడేమో! ఏమైతేనేం? తను వాడికి సరైన శాస్తి చేశాడు. ఇక జీవితంలో వాడు తన ఎదుట నిల్చి ఆస్తి పంచిపెట్టమని అడగలేడు!

ఇలా వూహించడంలో బలరామయ్య పొరబడినట్టు చెప్పలేము. ఎందుకంటే ఆ తరువాత ఎన్నడూ గోపాలం బలరామయ్య ఎదుటకు రాలేదు. లేదంటే ఒకసారి బలరామయ్యే గోపాలం యెదుటకు వెళ్ళవలిసి వచ్చింది.

ఓ రోజు యింటి కామందు బలరామయ్యకు కబురుపెట్టి వారం పదిరోజుల్లో యింటిని ఖాళీ చేసేయమన్నాడు.

"అబ్బే అదెలా కుదురుతుందండీ! మీ యింటిని వదలడానికి ముందు నేను మరో ఇల్లు చూచుకోవాలి గదా!" అన్నాడు బలరామయ్య.

"ఏం చేయమంటారు పంతులుగారూ? ఇంటిపైన బేరం తగిలింది. అడ్వాన్సుగూడా తీసుకున్నాను. నాలుగు రోజుల్లో రిజిస్ట్రేషను జరుగబోతుంది" అన్నాడు యింటి కామందు.

చేసేది లేక బలరామయ్య భార్యను బిడ్డలతో సహా పుట్టింటికి తరలించి, తనొక మిత్రుడి గృహంలో మకాం పెట్టి యింటిని ఖాళీ చేసి యజమానికి అప్పగించేశాడు.

తీరా యిల్లు ఖాళీ చేసిన తర్వాత వారం రోజులకు బలరామయ్యకో విషయం జ్ఞప్తికి వచ్చింది. పదిహేళ్ళనుంచి తన ముఖానికి అలంకారప్రాయంగా ఉంటూ తన బాహ్య వేషానికొక హంగును సమకూర్చిన నల్లద్దాల కళ్ళజోడు పెట్టెలో వెదికినా కనిపించడం లేదు. బహుశా ఖాళీ చేసిన ఇంట్లో ఏ వాసం పైన్నో లేక ఏ అలమారాలోనో ఉంచి తను మరచిపోయి ఉండాలి...ఎలాగూ అది మళ్ళీ దొరుకుతుందన్న నమ్మకం లేదు. కానీ ప్రయత్నించడంలో తప్పులేదు గదా!

కళ్ళజోడుపైన మమకారం బలరామయ్యను మళ్ళీ ఒకసారి అతడు వదిలిపెట్టి వచ్చిన యింటివైపు లాక్కెళ్ళింది. రాత్రి ఎనిమిది గంటల వేళ, ఇంటిముంగిట ఎవరూ లేరు. వెల్లవేసిన గోడలు తెల్లగా కళ కళలాడుతున్నాయి. క్రొత్తగా తీర్చిన రంగవల్లికలో అరుగులు అందంగా ఉన్నాయి. గృహాంతర్భాగం కూడా మునుపటికన్నా పరిశుభ్రంగా, కుర్చీలు బెంచీలు లాంటి క్రొంగ్రొత్త ఫర్నీచరుతో ఆహ్లాదకరంగా కనిపిస్తోంది.

"ఏమండీ...సార్!" అంటూ ఒకటి రెండుసార్లు పిలిచాడు బలరామయ్య. రేడియో సంగీతంలో అతడి పిలుపు లోపలికి వినిపించినట్టు లేదు.

అతడు ద్వారం దాటుకుని గదుల మధ్య దారిలో నుంచీ హాల్లోకి వెళ్ళాడు.

ఆ హాల్లో కనిపించిన దృశ్యం బలరామయ్యను నిశ్చేష్టుణ్ణిగా చేసి నిలబెట్టింది.

ఈజీచేర్లో గోపాలం, క్రింద చాపపైన పార్వతి. భార్య తమలపాకులు చుట్టి భర్త కందిస్తోంది. అతడు తాంబూలం నములుతూ శ్రావ్యమైన దక్షిణాది సంగీతం వింటున్నాడు.

అన్నగారిని చూడగానే విద్యుద్ఘాతం తిన్నవాడిలా తమ్ముడు తటాలున నిల్చున్నాడు. మరుక్షణాన అతడక్కడ లేడు. హాలుకు వెనుక వంటగదిలో వున్నాడు. ఆపాటికే అక్కడచేరి ఓ మూలగా నక్కి నిల్చున్న పార్వతి వైపు దీనంగా చూస్తూ, "బాబ్బాబూ! నీకు పుణ్యముంటుంది. వచ్చి కూర్చోమని చెప్పు పార్వతీ!" అంటూ బ్రతిమాలుకున్నాడు గోపాలం.

ఆ సందిగ్ధ పరిస్థితిలో అబల సబల గాక తప్పిందిగాదు. "నిల్చున్నారేం బావా? రండి. కూచోండి" అంటూ వచ్చిన అతిథి కాళ్ళు కడుక్కోటానికి పెద్ద చెంబు నిండుకు నీళ్ళు తీసుకుని యెదురు వెళ్ళింది పార్వతి.

బలరామయ్య మరబొమ్మలా వాలు కుర్చీలో కూర్చున్నాడు.

తొట్టిలో పడుకున్న బిడ్డను తీసుకొచ్చి పార్వతి పెదనాన్న గారి ఒడిలో పడుకోబెట్టింది.

పది నిమిషాల నీరవ నిశ్శబ్దం తరువాత బిడ్డ లేచి యేడుపు లంకించుకున్నాడు.

బిడ్డను చేతికి తీసుకుంటూ "లేచి కాళ్ళు కడుక్కోండి బావా? విస్తరి వేశాను" అంది పార్వతి.

"అబ్బే, అవసరం లేదమ్మా! భోజనం చేసే వచ్చాను" అంటూ పైకి లేచి, తిరిగి చూడకుండా బలరామయ్య బయటికి వచ్చేశాడు.

* * *

మనిషైతే వచ్చేశాడు గానీ, మనస్సు మాత్రం అక్కడే పరిభ్రమిస్తోంది.

ఇంటిని అమ్మివేస్తున్నట్లు చెప్పాడు యజమాని, కొంపదీసి దీన్ని కొనుక్కున్నవాడు గోపాలం కాదు గదా!

బలరామయ్య ఆశ్చర్యసాగరంలో మునిగి అట్టడుక్కువెళ్ళిపోయాడు. అలాగైతే వీడికెక్కడనుంచీ లభ్యమైనట్టు డబ్బు? ఒకవేళ వీడి మామగారిచ్చారేమో! ఐనా ఒక్కసారిగా కొన్నివేల రూపాయలు ఇచ్చుకోగల స్తోమత ఆ మామగారికి లేదే!

ఈ సందేహం బలరామయ్యను ఒక పట్టాన వదిలింది కాదు. అయిదారు రోజులు అతడు సరిగ్గా తిండీ నిద్ర లేకుండా ఆలోచించాడు. చివరకు అతడి సందేహాన్ని పటాపంచలు చేస్తూ పోష్టులో ఓ రిజిష్టరు నోటీసు వచ్చింది.

భూ స్థితిలో తనకు సంక్రమింప వలసిన వాటాను గోపాలం ఎవరికో పదివేల రూపాయలకు అమ్మేశాడు. వాళ్ళు తక్షణం వచ్చి కొలతలు వేసి భూమిని పంచకోరుతూ బలరామయ్యకు తాఖీదు పంపారు.

బలరామయ్య కళ్ళ ఎదుట ప్రపంచం గిర్రున తిరుగ సాగింది. అతడు హతాశుడై కూర్చున్న కుర్చీలోనే కృంగిపోయాడు.

● ఆంధ్ర సచిత్ర వార పత్రిక, 1966 ●